ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★ మంగళవారం 10 డిసెంబరు 2024

రేపు మున్సిపల్ సీఎం కప్ క్రీడాకారులు ఎంపిక

మంథని, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ స్థాయిలో సీఎం కప్ కోకో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 11న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో క్రీడాకారులను ఎంపిక జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల 15 సంవత్సరాల పైబడిన బాలబాలికలు, యువతీ, యువకులు తమ ఆధార్ కార్డులు, స్టడీ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలలోపు హాజరుకావాలని సూచించారు.

స్థానిక సంస్థల రిజర్వేషన్లపై ఉత్కంఠ

- పూర్తి కావస్తున్న కులగణన సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ
- వచ్చే నెలలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధం
- జిల్లాలో పోలింగ్ బూత్‌ల మ్యాపింగ్ ప్రక్రియ
- ప్రజలను ఆకట్టుకునేందుకు నేతల యత్నాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

బీసీ కులగణన సర్వే పూర్తయి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ దగ్గర పడుతుండడంతో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై ఉత్కంఠ నెలకొన్నది. దేశ వ్యాప్తంగా కుల గణన చేపడతామని గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కులగణన చేపట్టేందుకు గానూ కేబినెట్ తీర్మానం చేసిన విషయం తెలిసిందే. ఆ మేరకు గడిచిన నెలలో జిల్లా వ్యాప్తంగా సమగ్ర కుటుంబ కుల గణన సర్వే చేపట్టారు. సర్వే వివరాలను మండలాల్లో ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ మరోవారం రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పూర్తయిన తర్వాత ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. ఆ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. దీంతో తమ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవిని ఏ సామాజిక వర్గానికి రిజర్వ్ చేస్తారో అనే లెక్కలపై ఇప్పటి నుంచే గ్రామాల్లో చర్చ జరుగుతున్నది. గ్రామపంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ నాటికి ముగిసింది. అలాగే మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలాలు సైతం జూలైలో ముగిశాయి. అప్పటి నుంచి గ్రామ పంచాయతీల్లో, మండలాల్లో, జిల్లా పరిషత్‌లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. 2018లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జడ్పీటీసీల రిజర్వేషన్లను పదేళ్లకోకసారి రొటేషన్ చేయాలని పేర్కొన్నారు. ఆ మేరకు గత ఎన్నికల్లో ఉన్న రిజర్వేషన్లే ఈ ఎన్నికల్లోను ఉంటాయని అంతా భావించారు.

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో బీసీ కులగణన చేపట్టారు. కుల గణన ప్రకారం స్థానికసంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఆయా పార్టీలతోపాటు బీసీ సంఘాలు సైతం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. అంతేకాకుండా బీసీ సంఘాల నాయకులు కోర్టును కూడా ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేసింది. బీసీ కుల గణన పూర్తి కావస్తుండడంతో ప్రభుత్వం సైతం వచ్చే సంక్రాంతికి గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించింది.



పాలకుర్తి మండలం కొత్తపల్లిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు

● 4,07,716 మంది ఓటర్లు..

ఇప్పటికే మండలాలు, జిల్లాల వారీగా గ్రామీణ ప్రాంతాల ఓటర్ల జాబితా పూర్తయింది. జిల్లాలో మొత్తం 4,07,716 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 2,01,006 మంది, మహిళలు 2,06,697 మంది, 13 మంది ఇతరులు ఉన్నారు. జిల్లాలో కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీలతో కలిపి 269 పంచాయతీలకు ఎన్నికల నిర్వహించనున్నారు. ఇందులో 2,486 వార్డులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎన్నికలకు సంబంధించి జిల్లా పంచాయతీశాఖ అధికారులు ఇప్పటినుంచే అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల వారీగా, మండలాల వారీగా, జిల్లా వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేసిన అధికారులు గ్రామపంచాయతీలోని వార్డుల వారీగా

మిగతా 8వ పేజీలో...

నేటి నుంచి సమ్మె బాటలో సమగ్రశిక్ష ఉద్యోగులు

- ఉద్యోగ భద్రత, ఇతర సౌకర్యాలపై ఆందోళన
- జిల్లాలో 428 మంది ఉద్యోగులు

8



కాల్వశ్రీరాంపూర్ ఎంఈవోకు సమ్మె నోటీస్ అందజేస్తున్న ఉద్యోగులు

గోదావరిఖనిలో రోడ్ల విస్తరణకు శ్రీకారం 8

సింగరేణిలో రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి 8

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

కోల్‌సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని కోర్టు ప్రాంగణంలో ఈ14న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని గోదావరిఖని అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి డాక్టర్ పి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కోర్టులో లోక్‌అదాలత్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఇరుపార్టీలు రాజీ కుదుర్చుకోవచ్చునని, ఒకసారి జారీ కుదుర్చుకుంటే అప్పీల్‌కు ఆస్కారం కూడా ఉండదన్నారు. 14న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో సబ్‌డివిజన్ పరిధిలో రాజీకాదగ్గ నేరాలు, చెక్‌బౌన్స్ కేసులు, క్రిమినల్ కేసులు, వాహన ప్రమాద బీమా కేసులు, వరకట్న వేధింపులు, గృహహింస కేసులు రాజీ కుదుర్చుకోవచ్చునన్నారు. ఇందుకు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసుల రాజీకి పోలీసులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్‌సివిల్ జడ్జి నల్లా వెంకటసత్యంరెడ్డి, రెండో అదనపు మెజిస్ట్రేట్ వెంకటేష్ గురువ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తౌటం సతీష్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నహీద ప ర్వీన్, ఏసీపీ మడత రమేష్, సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రవీణ్‌కుమార్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మంథని, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హన్మకొండలోని కేయూలో జరిగిన అంతర్రాష్ట్ర కరాటే పోటీల్లో మంథనికి చెందిన జపాన్ సిటోరియో కరాటే విద్యార్థులు ప్రతిభను చాటి మెడల్స్ సాధించినట్లు కోచ్ కావేలి సమ్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కటా, కుమిత్ విభాగాల్లో అట్టెం రాఘవ, సుంకరి భరద్వాజ్, సూర్యప్రియ, కావేటి సంజయ్, బండారి మణికంఠ, బెజ్జంకి అక్షయ్‌కీర్తన్ బంగారు పతకం, జడగల మనస్విని వెండి, శివశాకిత్, రిషి, అద్వైత్ కాంస్య పతకాలు సాధించారు.

హాస్టల్ వార్డెన్లపై పని ఒత్తిడి తగ్గించాలి

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లోని వార్డెన్లపై పనిఒత్తిడిని తగ్గించాలని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ మద్దెల దినేష్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్షకు విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహం-2 వార్డెన్‌కి కూడా గోదావరిఖని కళాశాల వసతి గృహం, రామగుండం ప్రీ మెట్రిక్ బాలికల వసతి గృహం బాధ్యతలు కూడా ఉన్నాయన్నారు. దీంతో ఉదయం ఒక దగ్గర, సాయంత్రం మరో దగ్గర అన్నట్టు ఒక్కో వసతి గృహానికి వార్డెన్ హాజరవుతున్నారని తెలిపారు. ఫలితంగా రామగుండం బాలికల వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య కూడా గత ఏడాది కంటే భారీగా తగ్గిందని పేర్కొన్నారు. ఇది ఇలాగే కొనసాగితే విద్యార్థుల సంఖ్య తగ్గి హాస్టల్ మూసివేసే రావొచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థుల సంఖ్య తగ్గడంపై, స్థానికంగా అందుబాటు లో ఉండే వారిని తక్షణమే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులు పాడి పెంపకంపై దృష్టి సారించాలి

ముత్తారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు పాడి పెంపకంపై దృష్టి సారించాలని పశు వైద్యులు సూచించారు. కరీంనగర్ పశుగణాభివృద్ధి సంస్థ సూపర్‌వైజర్ రాఘవ ఆధ్వర్యంలో ఖైదంబండ గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం సందర్భంగా పాడి రైతులకు దూడల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి వైద్యులు కళ్యాణ్, వైద్యులు అర్చన, రేఖరాణి హాజరై రైతులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నట్టల నివారణ మందులను, మినరల్ మిక్చర్ పౌడర్‌ను అందించారు. గోపాలమిత్ర ద్వారా పశువులకు కృత్రిమ గర్భధారణ ద్వారా ఆడ దూడలు జన్మించే వీర్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. దీని విలువ 600 రూపాయలు ఉంటుందని ప్రభుత్వ రాయితీపై రైతులకు 250 రూపాయలకే అందిస్తున్నామని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గర్భకోశ వ్యాధి చికిత్సలు 46, కృత్రిమ గర్భధారణ రెండు, 46 దూడలకు నట్ట నివారణ మందులు తాగించారు. 60తి పశువులకు సాధారణ చికిత్స అందించారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు రాములు, సారయ్య, పశుసంవర్ధక శాఖ సిబ్బంది అశోక్, వెంకటేశ్ పాడి రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వేగంగా కొనాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని వేగవంతంగా మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ధాన్యం కొనుగోలు, రైతులకు చెల్లింపులపై కలెక్టర్ కోయ శ్రీహర్ష అదనపు కలెక్టర్ డి వేణుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రైతులకు అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం 17 తేమ శాతం రాగానే కాంటా వేసి మద్దతు ధరకు కొనుగోలు చేసి సంబంధిత మిల్లులకు తరలించాలని అన్నారు. రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని అన్నారు. ధాన్యానికి సంబంధించిన మద్దతు ధర, సన్న రకం ధాన్యానికి బోనస్ డబ్బులు రైతులకు సకాలంలో జమ అయ్యేలా చూడాలని అన్నారు. ధాన్యం రవాణా అంశంలో వాహనాల కొరత, హమాలీల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ధరణి పెండింగ్ దరఖాస్తులు, జాతీయ రహదారుల భూసేకరణ చెల్లింపులపై కలెక్టర్ కోయ శ్రీహర్ష అదనపు కలెక్టర్ డి వేణుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డివిజన్ వారీగా పెండింగ్ ధరణి దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ధరణి వెబ్‌సైట్‌లో నూతనంగా పెండింగ్ మ్యూటేషన్, పెండింగ్ సక్సెషన్ మొదలగు మాడ్యుల్స్ ను ప్రభుత్వం కలెక్టర్ నుంచి అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారుల కు బదలాయించడం జరిగిందని, వీటిని వేగవంతంగా క్లియర్ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మంచిర్యాల-వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ ఆర్బిట్రేషన్ సంబంధిత రైతులకు వేగవంతంగా చెల్లింపులు చేయాలన్నారు. జాతీయ రహదారి నిర్మాణపనులు త్వరగా గ్రౌండ్ అయ్యే విధంగా అధికారులు నేషనల్ హైవే అథారిటీకి పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి గంగయ్య, సురేష్, గోదావరిఖని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేడు ధర్మారంలో విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు

ధర్మారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) ధర్మారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పరచినట్లు ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల చైర్‌పర్సన్ ఎన్వీ గోపాలస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో లోవోల్టేజీల హెచ్చుతగ్గులు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, అదనపు లోడు క్రమబద్ధీకరణతో పాటు పలు సమస్యలపై వినియోగదారుల నుంచి లిఖిత పూర్వక ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగే లోకల్ కోర్టు అవకాశాన్ని ప్రజలు సద్వినియోగ పరచుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక



విద్యార్థికి ప్రశంస పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోమటికొండాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 6వతరగతి చదువుతున్న తెడ్డు నశ్విత రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈనెల 6,7 తేదీల్లో జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో వనరుల నిర్వహణ విభాగంలో ప్రొటెక్షన్ ఆఫ్‌రెయిన్ వాటర్ ప్రాజెక్ట్‌లో జిల్లాస్థాయి ప్రథమ బహుమతి సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైనందున జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా విద్యాధికారి రాము ప్రశంస పత్రం అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రాధిక, ఉపాధ్యాయులు జ్యోష్న, సుధ రాణి, విశాల్, రాణిలో పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో నేటి నుంచి గీతాజయంతి మహోత్సవం

వేములవాడ కల్చరల్, డిసెంబ రు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి ఆలయంలో మంగళ వారం నుంచి మూడు రోజులపాటు గీతాజయంతి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల సందర్భంగా 10వ తేదీ మంగళవారం నుంచి 12వతేదీ గురువారం వరకు ఉదయం 7.30 గంటల నుంచి స్వామివారి నాగిరెడ్డి మండపంలో మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం, అర్చనలు, గీతాహోమం, గీతా ప్రవచనములు నిర్వహించనున్నారు. రాజన్న అనుబంధ ఆలయాల్లో అర్చనలు, సాయంత్రం 4గంటల నుంచి శ్రీమద్భాగవతము దశమస్కంధ పురాణ ప్రవచనము చేపట్టనున్నట్లు తెలిపారు. 12వ తేదీన ఉదయం 11.15 గంటలకు పూర్ణాహుతి అనంతరం కలశోద్వాసనము నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గీతాజయంతి ఉత్సవాల సందర్భంగా రాజన్నఆలయంలో భక్తులకు అభిషేకాలకు ఉదయం 8 గంటల నుంచి అనుమతి ఇవ్వనున్నారు.

కాసేపు ఫోన్‌కు దూరంగా..



● ఇండోర్ గేమ్స్ ఆడుతూ..
● చిన్నారులు, యువత ఆట, పాటలతో ఉత్సాహం

ఇంట్లో ఉన్నా..బయట ఉన్నా.. పని ఉన్నా లేకున్నా చేతిలో స్మార్ట్ ఫోన్ చూస్తూ ఉండడం షరా మామూలైపోయింది. ఇంట్లో కుటుంబ సభ్యులతో గడపడం కన్నా ఫోన్‌తో గడపడం నిత్యం అలవాటుగా మారిపోయింది. మరి ఇంట్లో పెద్ద వాళ్లను చూసో ఏమో గానీ పిల్లలు కూడా చాలా వరకు స్మార్ట్ ఫోన్‌కు వ్యసనంగా మారుతున్నారు. ఇంట్లో కుటుంబ సభ్యులు కూడా ఖాళీ ఉన్న సమయాల్లోనూ చేతిలో ఫోన్‌తోనే గడిపేస్తున్నారు. అలా అందరూ కూర్చుని పది నిమిషాల పాటు ఒకరికొకరు మాట్లాడుకునే సందర్భం కనుమరుగవుతోంది. స్మార్ట్ ఫోన్ నుంచి కాసేపు దూరంగా ఉండేందుకు కాస్త వెరైటీగా ఆలోచించారు ఆ యువకులు. కాసేపు ఫోన్ పక్కన పెట్టి ఇన్‌డోర్ గేమ్స్‌కు ఆటలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అలనాటి పాత ఆటలతో కాలక్షేపంతో పాటు అందరం కలుసుకుంటున్నామని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను సైతం ఈ ఆటల్లో ప్రోత్సహించడంతో స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉంటున్నారు.



ఇండోర్ గేమ్స్ ఆడుతున్న చిన్నారులు

మల్యాల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికీ సెల్‌ఫోన్ అందుబాటులో ఉండగా మొబైల్ లేనిదే నిద్ర లేవలేని పరిస్థితులు నెలకొన్నాయి. నిద్ర లేచిన నుంచి పడుకునే వరకు దైనందిన జీవితంలో సెల్‌ఫోన్ లేనిదే ఎలాంటి కార్యకలాపాలు జరుగలేని విధంగా స్మార్ట్‌ఫోన్ అలవాటైపోయింది. మాట్లాడడంతో పాటు డబ్బుల లావాదేవిలకు, వినోదం, ప్రయాణాలకు, కాలాక్షేపం లాంటి ఇంకా అనేక అంశాలతో సెల్‌ఫోన్ ముడిపడింది. ముఖ్యంగా చిన్నారులు ఫోన్‌కు అలవాటు పడుతుండడంతో వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీన్ని గమనించిన కొందరు యువకులు స్మార్ట్‌ఫోన్ నుంచి కొంత మేర అయినా బయట పడేందుకు కొత్త ఆలోచనతో ముందుకు వచ్చారు. మల్యాల మండలం రామన్నపేటలో నెలరోజులుగా గ్రామానికి చెందిన ఎం.డీ అజర్, కోరుట్ల రవి మరి కొందరు నిర్వహిస్తున్న ఈ కార్యకలాపాలకు ప్రజల నుంచి అభినందనలు అందుతున్నాయి.

● ఆటలతో స్మార్ట్‌ఫోన్‌కు దూరంగా..



పాఠశాలకు వెళ్లి వచ్చిన చిన్నారులు ఇంటికి రాగానే స్మార్ట్‌ఫోన్ పట్టడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందు తుండడంతో ఈ యువకులు ప్రత్యేకంగా ఓ గదిని అద్దెకు తీసుకొని కొంత డబ్బులు పోగు చేశారు. వాటితో క్యారం బోర్డు, బ్యాడ్మింటన్, చెస్ ఆడేవి తదితర పరిక రాలు, ఇతర క్రీడా సామగ్రి కొనుగోలు చేసి అందుబాటులో ఉంచారు. ఇందులో ఆటలతో పాటు చదువుకోవ డం, హోంవర్క్ చేయడం అలాగే చిన్నారులతో పాటు పెద్ద వారు సైతం వ్యాయామాలు చేస్తున్నారు. దీంతో కొన్ని గంటల పాటు అయినా చిన్నారులు, పెద్దలు స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉంటారనేది వారి ఆలోచన.

● ఇప్పటికే అనేక సామాజిక కార్యక్రమాలు

రామన్నపేట గ్రామస్థుల మన ఊరు-మనవార్తలు వాట్సప్‌గ్రూప్‌తో ఇప్పటికే అనేక సామాజిక కార్యక్ర మాలు నిర్వహిస్తుండగా స్మార్ట్‌ఫోన్ వినియోగంతో కలిగే దుష్ప్రభావాల నియంత్రణకు ప్రతి రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి వృద్ధులు, మహిళలు, చిన్నారులు, యువకులు అందరు ఒక చోట కలిసేలా ఏర్పాటు చేశారు. యువకుల ఆలోచనకు గ్రామస్థుల తోడ్పాటు అందడంతో నిత్యం ఇక్కడకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. ఆట. పాటలతో పాటు పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవాలు తదితర కార్యక్రమాలు కూడా చేసుకుంటున్నారు. కాసేపు స్మార్ట్‌ఫోన్ గురించి మరచిపోతుండడంతో గత గుర్తులు మళ్లీ యాదికొస్తున్నాయంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు స్క్రీన్ టైం మోతాదుకు మించి వాడి ఆన్‌లైన్ గేమ్స్ నుంచి బయట పడక పోవడంతో అనారోగ్యంపై ప్రభావం చూపుతోందని, చిరాకు, మొండిగా ప్రవర్తించడాన్ని నివారించడానికి ఇంకా అనేక ఆలోచనలకు ఆ యువకులు పునాది వేస్తున్నారు.



కొనుగోలు చేసిన వివిధ రకాల పుస్తకాలు

● స్మార్ట్‌ఫోన్ వ్యసనం నుంచి బయటపడేందుకు..



స్మార్ట్‌ఫోన్ వ్యసనం నుంచి బయటపడేందుకు తాము ఈ కార్యక్రమం చేపట్టాము. స్మార్ట్‌ఫోన్ వల్ల కలిగే నష్టాలు, హానికర యాప్స్, సమయ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నాము. ఆరోగ్యకరమైన జీవన శైలి కోసం తాము ఈ ప్రయత్నం చేశాము. ప్రజలు, చిన్నారులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

- ఎం.డీ అజర్, వ్యవస్థాపక సభ్యుడు, రామన్నపేట

● కాలక్షేపం చేస్తున్నాం



స్మార్ట్‌ఫోన్ పక్కన పెట్టి నిత్యం ఇక్కడకు వచ్చి ఆటలు ఆడుతూ, కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నాం. దీంతో ఆ సమయంలో స్మార్ట్‌ఫోన్ వాడడం లేదు. క్యారం, అష్టాచమ్మాలాంటి పాత ఆటలు ఆడు తూ మైమరిచిపోతున్నాం. పుస్తకాలలోని బొమ్మలతో సరదాగా ఉంటుంది. సెల్‌ఫోన్ వాడడం దాని వల్ల కలిగే నష్టాల గురించి చెబుతున్నారు.

- గీతాంజలి, గ్రామస్థురాలు

క్రైం కార్నర్

మొక్కజొన్న పంటలపై అడవి పందుల దాడి

● 15 ఎకరాల్లో పంట ధ్వంసం



పొత్కపల్లిలో ధ్వంసమైన మొక్కజొన్న పంట

ఓదెల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లి, రూపునారాయణపేట, జీలకుంట, శానగొండ, గొల్లపల్లి, గ్రామాల్లోని మొక్కజొన్న పంటలపై ఆది, సోమవారాల్లో అడవి పందులు దాడి చేసి బీభత్సం సృష్టించాయి. పొత్కపల్లి అనుబంధ గ్రామం గొల్లపల్లికి చెందిన కనెవేని కొమురయ్య అనే రైతుకు చెందిన ఎకరంన్నర మొక్కజొన్న పంటను దాదాపు 50 శాతం ధ్వంసం చేశాయి. లేత గింజ దశలో ఉన్న మొక్కజొన్నను అడవి పందుల గుంపు ధ్వంసం చేస్తుండడంతో రాత్రింబవళ్లు సైతం కాపలా కాస్తున్నామని, అయినప్పటికీ పంట ధ్వంసం ఆగడం లేదని కొమురయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చేతికంది వచ్చిన మొక్కజొన్న పంటల్లోనే పందులు తిష్ట వేసి ధ్వంసం చేయడమే కాకుండా, ఒంటరిగా ఉన్న రైతులపై కూడా దాడికి ప్రయత్నిస్తున్నాయని రూప్‌నారాయణపేట, జీలకుంట రైతులు తెలిపారు. అడవి పందుల నుంచి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులను రైతులు కోరారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

ఎలిగేడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాములపల్లి-నారాయణపూర్ గ్రామాల మధ్య ఉన్న ఎస్సారెస్పీ ఉపకాలువ వద్ద బైక్ అదుపుతప్పి అదేకాలువలో పడి సిరిసిల్ల కిరణ్(37) అనే యువకుడు మృతి చెందాడు. జూలపల్లి ఇన్‌చార్జి ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీకి చెందిన కిరణ్ కరీంనగర్‌లోని ఫైనాన్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. జూలపల్లి మండలం చీమలపేటకు చెందిన తన స్నేహితుడిని కలిసి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు కిరణ్ భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నరేష్ పేర్కొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● బంగారం, వెండి, నగదు అపహరణ



చిందరవందరగా పడి ఉన్న వస్తువులను పరిశీలిస్తున్న సీఐ

కమాన్‌పూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాజాగా మండల కేంద్రంలోని పోస్టాఫీస్ వీధిలో బిల్లా రాజయ్య ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి ఇంటికి గత నెల 27న వెళ్లారు. ఆదివారం రాత్రి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లో వెళ్లి చూడగా ఇంట్లోని బీరువాను పగలగొట్టి అందులో ఉన్న 11 తులాల బంగారం, 80 తులాల వెండి, రూ. 30 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం గోదావరిఖని టూటౌన్ సీఐ నక్క ప్రసాద్, ఎస్ఐ కొట్టె ప్రసాద్, పోలీస్ సిబ్బంది ఇంటి పరిసరాలను పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక డంపుల స్వాధీనం



నిలువ ఉన్న కుప్పలను సీజ్ చేస్తున్న ఆర్ఐ మహ్మద్ అమర్

కోరుట్ల రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎఖీన్‌పూర్ నుంచి ఎస్సారెస్పీ కాలువ ద్వారా నాగులపేటకు వెళ్లే రహదారిని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో అక్రమంగా నిలువ ఉన్న ఇసుక కుప్పలను సోమవారం ఆర్ఐ మహ్మద్ అమర్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. సుమార్ 50 నుంచి 60 ఇసుక కుప్పలు ఉన్నట్లు వాటిని సీజ్ చేసినట్లు ఆర్ఐ మహ్మద్ అమర్ తెలిపారు. నాగులపేట నుంచి కోరుట్ల వైపు అక్రమంలో ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆర్ఐ తెలిపారు. ట్రాక్టర్లను రెవెన్యూ కార్యాలయానికి తరలించినట్లు ఆర్ఐ వివరించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

మల్లాపూర్ : అనుమతులు లేకుండా గోదావరి, వాగుల పరివాహక ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని మల్లాపూర్ తహసీల్దార్ వీర్‌సింగ్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని వాల్గొండ గ్రామ శివారులోని గోదావరి నుంచి అక్రమంగా ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని చర్యల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

ఇసుక లారీలను అడ్డుకున్న ఊటూర్ గ్రామస్థులు

మానకొండూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊటూర్ మానేరు వాగు నుంచి ఇసుకను తరలించడంతో రోడ్డు దెబ్బతింటుందని గ్రామస్థులు సోమవారం రాత్రి ఇసుక లారీలను అడ్డుకున్నారు. ప్రతినిత్యం వందలాది లారీలు మానేరు వాగు నుంచి ఇసుకను తరలించడం వల్ల రోడ్డు దెబ్బతినడమే కాకుండా దుమ్ము, ధూళితో రోడ్డుప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంకరపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన మోహన్‌కుమార్ (21) అనే వ్యక్తి గోపాల్‌పూర్‌లోని వల్లెపు యాదగిరి వద్ద కూలీ పనిచేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి గోపాల్‌పూర్ నుంచి కొత్తగట్టుకు టీఎస్03ఈఆర్0606 ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. బైక్ అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో కొత్తగట్టు గ్రామ శివారులోని జేసీఎం ఫంక్షన్ హాల్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో మోహన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి సోదరుడు అమర్ చౌదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ముస్తాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొని ఓ యువకుడి మృతిచెందిన సంఘటన ముస్తాబాద్ మండలంలోని గుడెం శివారులో చిప్పలపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే చిప్పలపల్లి గ్రామానికి చెందిన జంగిటి సాయి(18) అనే యువకుడు డీజిల్ తీసుకురావడానికి వెళ్తుండగా గూడెం మూలమలుపు వద్ద బైక్ చెట్టుకు ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రులు కిషన్ భాగ్యలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముగ్గురు ఆడపిల్లల తరువాత ఉన్న ఒక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు.

దుబాయ్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఆధ్వర్యంలో దుబాయ్‌లో బైక్‌రైడర్స్, డెలివరీ బాయ్స్, సెక్యూరిటీగార్డు ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి తెలిపారు. డెలివరీ బాయ్స్, బైక్ రైడర్ల ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణతతో కనీసం రెండు సంవత్సరాల డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అభ్యర్థుల వయస్సు 21-40 సంవత్సరాల మధ్య ఉండి పాస్‌పోర్టు ఉన్నవారు అర్హులని తెలిపారు. సెక్యూరిటీ ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై 21-32 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలన్నారు. వివరాలకు 9440050951, 9440049861 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు

గుత్తిరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుత్తి మండలం కరిడికొండ గ్రామ శివారులో గల 44వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన బాలప్రకాష్, దివ్య దంపతులు తమ కుమారుడు వివాన్‌తో కలిసి కారులో బెంగళూరుకు వెళ్తున్నారు. కరిడికొండ గ్రామశివారులోకి రాగానే కారు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో బాలుడు వివాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వర్గీకరణపై ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణపై అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తిక్ డిమాండ్ చేశారు. సోమవారం ఉమ్మడి జిల్లా మాదిగ విద్యార్థుల మహాసభను పురస్కరించుకొని స్థానిక కార్ఖానగడ్డలో విద్యార్థులు, కులపెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1న సుప్రీంకోర్టు తీర్పు న్యాయబద్ధమైనదని, అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ చేసి చూపిస్తామని ముఖ్యమంత్రి మాటి ఇచ్చి తప్పారని అన్నారు. మాట తప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై మరో పోరాటానికి మాదిగ విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి తన మంత్రి పదవికోసం మాలలను రెచ్చగొడుతూ తన స్వంత డబ్బుతో వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేయిస్తున్నాడని ఆరోపించారు. దీనిని మాల మేధావులు, విద్యావేత్తలు తక్షణమే ఖండించి వర్గీకరణ సామాజిక న్యాయమని వర్గీకరణ చేసుకొని మాల మాదిగలు అన్నదమ్ములుగా కలిసి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెంచల నవీన్, ప్రధాన కార్యదర్శి కొరవు ప్రభాకర్, ఎంఎస్‌పీ అధికార ప్రతినిధి దండు అంజయ్య, ఎంఆర్‌పీఎస్ టౌన్ అధ్యక్షుడు దండు మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్లీ శ్మశానానికి చేరిన తల్లి

● రెండోసారి వదిలివెళ్లిన కొడుకులు



వృద్ధురాలితో మాట్లాడుతున్న మహిళలు

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణానికి చెందిన అల్లం రాజవ్వ అనే వృద్ధురాలిని తన కుమారులు మళ్లీ శ్మశాన వాటికలో వదిలివెళ్లారు. పక్షం రోజుల క్రితం వృద్ధురాలిని శ్మశాన వాటికలో వదిలివెళ్లగా సఖీ సెంటర్ నిర్వాహకులు వృద్ధురాలిని జగిత్యాల ప్రధాన ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. అనంతరం జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు హరి అశోక్‌కుమార్‌లు వృద్ధురాలి కుమారులను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించి కుమారులకు అప్పగించారు. అయితే వారు వృద్ధురాలిని తిరిగి శ్మశాన వాటికలో వదిలారు. వృద్ధురాలికి చెందిన సమీప బంధువులు మరణించడంతో మూడవ రోజు కార్యక్రమానికి వచ్చిన ఓ మహిళ వృద్ధురాలి గొంతు విని ఇక్కడ ఎందుకు ఉన్నావని అడిగింది. దీంతో తన కుమారుడు సీనయ్య తనను వదిలి వెళ్లాడని ఆమెతో వృద్ధురాలు వాపోయింది. కొంచెం అన్నం పెట్టి, కప్పుకోడానికి ఏదైనా ఇవ్వమంటూ సదరు మహిళను అడగడం అక్కడున్న వారిని కలిచి వేసింది.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు సిరిసేడు విద్యార్థి ఎంపిక

ఇల్లందకుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలం సిరిసేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నాగపూర్ శ్రీచరణ్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 4న కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ టెక్నో మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 బాల బాలికల నెట్ బాల్ సెలక్షన్స్ జరిగాయి. ఈ నెల 9,10,11వ తేదీల్లో కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీచరణ్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శ్రీచరణ్‌ను హెచ్‌ఎం జగదీశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

అథ్లెటిక్స్ జాతీయ పతక విజేతకు అభినందన



నక్షత్రను అభినందిస్తున్న రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘ ప్రతినిధులు

కరీంనగర్ స్పోర్ట్స్ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరుగుతున్న 39వ జాతీయ జూనియర్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన గైని నక్షత్ర కాంస్య పతకం సాధించింది. అండర్-14 బాలికల విభాగంలో ట్రయాథ్లిన్ పోటీల్లో పాల్గొన్న ఆమె విశేష ప్రతిభచాటి కాంస్య పతకం సాధించింది. గత సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు గుంటూరులో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా నక్షత్రనను, ఆమెకు శిక్షణ అందించిన కోచ్ తిరుపతిని రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు స్టాన్లీ జోన్స్, సారంగపాణి, కోశాధికారి రాజేశ్ కుమార్, రాష్ట్ర సంఘ బాధ్యులు వెంకట్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి అభినందించారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి : డీటీసీ



సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ పురుషోత్తం

తిమ్మాపూర్,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): వాహన షోరూం నిర్వాహకులు వాహన కొనుగోలుదారులకు రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించాలని డీటీసీ పెద్దింటి పురుషోత్తం ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో జిల్లాలోని వాహన షోరూం నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వాహనాల కొనుగోలు సమయంలో షోరూం నిర్వాహకులు వివరాలు నమోదు చేసుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తప్పులు జరుగుతున్నాయని అన్నారు. ఆధార్ కార్డులో ఉన్న చిరునామా పోస్టల్ అడ్రస్, మండలాలు సక్రమంగా ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేసే ప్రూఫ్‌లు సక్రమంగా ఫొటోలు తీయకపోవడం, ఇన్‌వాయిస్ ఇతరాల్లో తప్పులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో రిజిస్ట్రేషన్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్, కారు నడిపే వారు ఖచ్చితంగా సీటు బెల్టు ధరించే విధంగా, అతివేగంగా వాహనాలు నడపవద్దని అవగాహన కల్పించాలన్నారు. నూతన వాహనాలు రిజిస్ట్రేషన్‌కు వచ్చినప్పుడు కొన్ని వాహనాలకు సంబంధించిన చాసిస్ నెంబర్లు సరిగా కనబడటం లేదన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఇబ్బందులు ఏర్పాడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు శ్రీకాంత్ చక్రవర్తి, రవికుమార్ పాల్గొన్నారు.

పొగాకు వైపు రైతుల చూపు

- అధిక ధర పలుకుతుండడంతో ఆసక్తి
- భిన్నమైన పంటల సాగుతో లాభాలు


గుజ్జులపల్లిలో ఆరేందుకు కొట్టంలో కట్టిన పొగాకు తోరణాలు

సైదాపూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రతి సారి ఒకే పంట వరి, మొక్కజొన్న, పత్తి పంటలు వేయడం వల్ల దిగుబడి తగ్గి నష్టాలపాలవుతున్నారు. దీంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గం వైపు అడుగులు వేస్తున్నారు. ఆరుతడి పంటలు అందులో ఆదాయం ఎక్కువ వచ్చే పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. ఆయిల్ పామ్ సాగు చేయాలని ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. పొగాకు సాగు లాభదాయకంగా ఉండ టంతో రైతులు సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. సైదా పూర్ మండలంలోని గొడిశాల, నల్లరామయ్యపల్లి, గుజ్జులపల్లి, ఎల్లంపల్లి, రాంచంద్రాపూర్, ఎలబోతారం, చింతలపల్లి, జాగీర్‌పల్లి గ్రామాలతో పాటు మరి కొన్ని గ్రామాలలో మొక్కజొన్న, పత్తికి బదులుగా రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. ఈ పొగాకు సాగుకు పని ఎక్కువగా ఉన్నప్పటికి ఆదాయం ఎక్కువ వస్తుందని రైతులు మొగ్గు చూపుతున్నారు. గత సంవత్సరం పొగాకు సాగు చేసిన రైతులకు మంచి ధర పలికి ఒక ఎకరాకి రూ. 2.5 నుంచి 3లక్షల వరకు ఆదాయం వచ్చిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం క్వింటాల్ కు రూ. 15,000 నుంచి 20,000 వేల వరకు ధర పలికిందని తెలుపుతున్నారు. ఈ సంవ త్సరం కూడా మంచి ధర పలుకుతుందని రైతులు భావి స్తున్నారు. మరోవైపు పొగాకు నారు 2వేల మొక్కలకు సుమారు 3500 ధర పలుకుతుంది. దాంతో పొగాకు నారు యజమానులు ఒక ఎకరాకు సుమారు 5నుంచి 8లక్షల వరకు సంపాదిస్తున్నట్లు రైతులు తెలు పుతున్నారు.


గొడిశాలలో ఏపుగా పెరిగి కోత దశలో ఉన్న పొగాకు తోట

● పొగాకుతో పని ఎక్కువే

పొగాకు సాగు సుమారు నాలుగు నెలలో పూర్తవు తుంది. మొక్కలు ఏపుగా పెరిగే వరకు ఎరువులు వేస్తూ, కలుపు తీస్తూ, నీరు సంవృద్ధిగా కట్టాలి. మొక్కలు కొంచెం పెరగగానే మొక్క కింది భాగంలో ఎరుపుగా మారిన ఆకులు తీసి వాటిని తోరణాలు గుచ్చి నీడలో ఆరబెట్టాలి. పూర్తిగా ఎండిన తరువాత ఆ తోరణాలు తీసి ఎండిన పొగాకును మండెగా వేయాలి. చెక్క బాక్సు లలో తొక్కి బేల్లుగా తయారు చేయాలి. అప్పుడు వాటిని వ్యాపారులకు విక్రయించాలి. ఇలా ఒక్కొక్క చెక్కు 50నుంచి 100కేజీల వరకు ఉంటుంది. సుమారు 3 నెలలు పని ఉంటుంది. కానీ ధర సక్రమంగా ఉంటే ఆదాయం అలాగే రెట్టింపుగా వస్తుందని రైతులు తెలుపుతున్నారు.


జాగీర్‌పల్లిలో మండెగా వేసిన ఎండిన పొగాకు

● పొగాకు లాభదాయకమే

కష్టపడి పనిచేస్తే అన్ని పంటల కన్నా పొగాకుతో లాభంగానే ఉంటుంది. ఒక రెండు నెలలు ప్రతి రోజు పొగాకు పనిమీదనే ఉండాలి. దానిని సరైన సమయం లో ఆకు తీసి ఆరబెట్టి మండెకట్టి ఆకును నల్లబడ కుండా చూసుకోవాలి. గత సంవత్సరం 20 గుంటల వరకు పొగాకు సాగు చేశాను మంచి లాభం వచ్చింది. ఈ సంవత్సరం ఒక ఎకరం వరకు సాగు చేస్తున్నా.

- గుడిసే శ్రీనివాస్, రైతు, జాగీర్‌పల్లి

న్యాయం గెలిచింది..

- ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్



వేములవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘకాలంగా తాను చేస్తున్న పోరాటం ఫలించిందని, న్యాయం గెలిచిందని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ పౌరసత్వాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర హైకోర్టు తీర్పుపై సోమవారం ఆయన స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. 15 ఏళ్లుగా తాను చేస్తున్న న్యాయపోరాటానికి ఇన్నేళ్లకు ముగింపు లభించిందన్నారు. ఇన్నేళ్ల తన న్యాయ పోరాటానికి సహకరించిన వారందరికీ, మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. అభ్యర్థిత్వంపై మోసం చేసినందుకు చెన్నమనేని రమేష్‌పై చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరనున్నట్లు చెప్పారు.

పౌరసత్వం వివాదం సృష్టించారు

- చెన్నమనేని రమేశ్



తన పౌరసత్వం రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు తనకు తీవ్ర నిరాశను కలిగించిందని వేముల వాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ అన్నారు. హైకోర్టు తీర్పు వెలువరించిన అనంతరం ఆయన సోమవారం తన వ్యక్తిగత సహాయకుల ద్వారా తన అభిప్రాయాన్ని పంపించారు. హైకోర్టులో తన పౌరసత్వం పైన వెలువడిన తీర్పు తీవ్రంగా నిరాశపరిచిందని, ఈ తీర్పు హేతుబద్ధంగా లేదన్న అభిప్రాయంతో తాను ఏకీభవిస్తున్నానని పేర్కొన్నారు. రాజకీయ జీవితంలో ఒడిదొడుకులు సహజ మని, వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తనపై కుట్ర చేసి పౌరసత్వ వివాదం సృష్టిం చారని, హైకోర్టు తీర్పుపై అప్పిలు చేయడానికి గల అవకాశాలను తన న్యాయవాదులు పరిశీలిస్తున్నారని చెన్నమనేని రమేష్ తెలిపారు.

కొండగట్టులో ముగిసిన విజయోత్సవాలు


కొండగట్టులో నిర్వహిస్తున్న పూజలలో పాల్గొన్న అర్చకులు, సిబ్బంది

మల్యాల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో జరుగుతున్న ప్రజాపాలన-ప్రజావిజయోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు రాష్ట్ర సుభిక్షం కోసం ఆలయ స్థానాచార్యులు కపీంధర్, ప్రధానర్చకులు జితేంద్రప్రసాద్, రామకృష్ణ, ఉపప్రధానర్చకులు చిరంజీవ స్వామి, మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, రామభజన కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, నీల చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాహిత్యంపై దృష్టి సారించాలి

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్



మాట్లాడుతున్న వారాల ఆనంద్

గణేశ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాహిత్యంపై దృష్టి సారించాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్ అన్నారు. ఇతర భాషల విలువలను, సంస్కృతిని, రచన తత్వాన్ని మరో భాషలోకి తీసుకురావడం లక్ష్యంగా అనువాదం సాగుతుందన్నారు. సోమవారం ఎస్సారార్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు అనువాద పద్ధతులపై ఒక్కరోజు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా వారాల ఆనంద్ విద్యార్థులకు తెలుగు అనువాదంలోని మెళకువలను తెలియజేశారు. ఈసందర్భంగా ఎస్సారార్ ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సాహిత్యాన్ని తమ జీవితంలో భాగంగా చేసుకొని పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని రూపొందించుకోవాలన్నారు. తెలుగు విభాగాధిపతి డా.బూర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ అనువాదాలు చేసేవారు మాతృభాషా సాహిత్యాలను బాగా అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో అటానమస్ కోఆర్డినేటర్ వంగల శ్రీనివాస్, అధ్యాపకులు బూర్ల వేంకటేశ్వర్లు, ప్రకాశ్, డా.ఆర్ శ్రీనివాస్, మెట్టు వేంకటేశ్వర్లు, డా. పాత అశోక్, డా. పి. చైతన్య, డా. పి. అనిల్ కుమార్, పి. శంకర్, డా. టి.భోజన్న పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న ఆర్టీసీ కార్గో


పంపించడానికి సిద్ధంగా ఉన్న పార్సిల్స్

- రూ.9 కోట్లకు చేరువలో రీజియన్ సంవత్సర ఆదాయం
- సగానికి పైగా ఆదాయం కరీంనగర్ కౌంటర్‌లోనే

భగత్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ కార్గో సేవలతో కాసులు కురిపిస్తున్నది. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 11 డిపోలు కరీంనగర్-1, కరీంనగర్-2, గోదావరిఖని, హుస్నాబాద్, హుజూరాబాద్, మంథని, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ డిపోలు ఉన్నాయి. డిపోల వారీగా కార్గో కౌంటర్లు ఏర్పాట్లు చేసి పార్సిల్స్ పంపించడం, వచ్చిన పార్సిల్స్‌ను బట్వాడ చేయడంతో ఆర్టీసీకి ఆదాయం సమకూరుతున్నది. రీజియన్ వ్యాప్తంగా పోల్చుకుంటే మొత్తం వచ్చిన ఆదాయంలో సగానికి పైగా కరీంనగర్ కౌంటర్ నుంచే వస్తోంది. కరీంనగర్ రీజియన్‌లో కార్గో సేవలతో ఆదాయ సముపార్జనలో ముందంజలో ఉంటున్నది. జనవరి నుంచి నవంబరు మాసం వరకు ఇప్పటి వరకు రీజియన్ వ్యాప్తంగా 8,76,62,753 రూపాయల ఆదాయం సమకూరింది.

● కరీంనగర్ కౌంటర్‌లో ఆదాయం

నెల	పార్సిల్స్ సంఖ్య	ఆదాయం
జనవరి	25,538	41,76,460
ఫిబ్రవరి	22,706	39,27,486
మార్చి	23,053	40,39,050
ఏప్రిల్	22,018	39,23,880
మే	23,625	41,78,474
జూన్	22,856	41,47,712
జులై	22,882	39,28,111
ఆగస్టు	24,165	42,20,101
సెప్టెంబర్	22,731	40,84,057
ఆక్టోబర్	24,815	44,74,236
నవంబర్	25,232	45,43,992
మొత్తం	2,59,621	4,56,43,559

కరీంనగర్ కౌంటర్‌లో ఇప్పటి వరకు 4,56,43,559 రూపాయల ఆదాయం సమకూరింది.

● జిల్లా వ్యాప్తంగా కౌంటర్లు

కార్గో సేవలందించడానికి ఆర్టీసీ 44 కౌంటర్లు ఏర్పాట్లు చేసి పార్సిల్స్‌ను అందిస్తున్నారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా డిపోల పరిధిలో ఏజెంట్లను నియమించి కౌంటర్లు ఏర్పాట్లుచేసి కార్గో సేవలు అందిస్తున్నారు. గోదావరిఖని డిపో పరిధిలో 3, హుస్నాబాద్ డిపో పరిధిలో 4, హుజూరాబాద్ 7, కరీంనగర్-1 డిపో పరిధిలో 6, కరీంనగర్-2 డిపో పరిధిలో 4, మంథని పరిధిలో 3, జగిత్యాల పరిధిలో 6, కోరుట్ల పరిధిలో 4, మెట్‌పల్లిలో 1, సిరిసిల్లలో 5, వేములవాడలో ఒక కౌంటర్ ఉన్నాయి. ఇందులో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల డిపోల్లో ఆర్టీసీ సొంతంగా కౌంటర్లు ఏర్పాటుచేసి కార్గో సేవలు అందిస్తున్నది. ప్రయాణికులను చేరవేయడమే కాకుండా తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అదనపు ఆదాయ మార్గాలను అన్వేషించి కార్గో సేవలందిస్తూ అధిక ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

రీజియన్ వ్యాప్తంగా వచ్చిన ఆదాయం

నెల	పార్సిల్స్ సంఖ్య	ఆదాయం
జనవరి	51,163	83,50,042
ఫిబ్రవరి	43,709	75,73,966
మార్చి	44,860	78,56,245
ఏప్రిల్	44,059	78,93,985
మే	45,939	79,25,789
జూన్	43,049	76,76,432
జులై	43,557	74,41,901
ఆగస్టు	46,761	81,92,080
సెప్టెంబర్	43,738	78,70,135
అక్టోబరు	46,761	82,83,079
నవంబరు	47,623	85,99,099
మొత్తం	5,01,227	8,76,62,753

ప్రయాణికులకు సౌకర్యాలు అందించాలి

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్లతో ఈడీ సమీక్షా సమావేశం


రీజినల్ మేనేజర్లతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జోన్ ఈడీ ఖుస్రోషాఖాన్


భగత్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన రీజినల్ మేనేజర్లతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఆదాయ వనరులను మెరుగు పరుచు కోవాలన్నారు. ప్రమాదాలను నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్లు రాజు, సోలమన్ రాజు, సరిరాం, విజయభాను, జ్యోత్స్న, డిప్యూటి రీజినల్ మేనేజర్లు కె సత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, సరస్వతి, శంకర్, ప్రవీణ్, భానుకిరణ్, మాధవరావు, భవాణిప్రసాద్, డిప్యూటి చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్, స్వప్నకుమారి, వర్క్స్ మేనేజర్ సుగుణాకర్‌రావు, కె యుగేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బోయేజ్‌కుమార్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

● ఏసీ బస్సు సర్వీసుల్లో పది శాతం రాయితీ

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏసీ స్లీపర్, ఏసీ స్లీపర్‌కమ్ సీటర్, రాజధాని బస్సుల్లో తెలంగాణ, అంతర్రాష్ట్ర ప్రయాణికులకు గాను బేసిక్ చార్జీలో పదిశాతం రాయితీ కల్పిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ రాజు ఒకప్రకటనలో తెలి పారు. ఈ అవకాశం డిసెంబరు 31వరకు ఉంటుందని ప్రయాణికులు వినియోగించుకోవాలన్నారు.

కొండెక్కిన కోడిగుడ్డు

● ఒక్కింటికి రూ. 7.50



హుజూరాబాద్‌రూరల్, డిసెంబర్ 9, (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో కోడిగుడ్ల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ఇదే సమ యంలో చికెన్ ధరలు తగ్గుతూ వస్తున్నాయి. ఒక కోడి గుడ్డు ధర హోల్‌సేల్‌గా రూ. 6.2లు కాగా, రిటైల్ కాగా రూ.7 పలుకుతుండగా, గ్రామాల్లోని చిన్న దుకాణాల్లో మాత్రం రూ.7.50 ధర పలు కుతోంది. చలికాలంలో కోడిగుడ్ల ధరలు పెరగడం సాధారణమేనని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. ఈ నెలలో క్రిస్మస్ పండగ ఉంది. ఈ వేడుకల్లో ప్రధానంగా కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపు కుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో ముందదస్తు క్రిస్మస్ వేడుకలు ప్రారంభమ య్యాయి. ఇదే సమయంలో కేక్‌ల వినియోగం, విక్రయాలు పెరిగాయి. కేక్‌ల తయారీలో కోడిగుడ్ల వినియోగం అధికంగా ఉంటుంది. దీంతో సహజంగానే వాటికి డిమాండ్ పెరుగుతుందని కొందరు చెపుతున్నారు.

● చికెన్ ధర తగ్గుదల

కార్తీక మాసం నేపథ్యంలో చికెన్‌ధరలు తగ్గాయి. కార్తీకమాసం ప్రారంభంలో కేజి చికెన్‌ధర రూ. 230 వరకు పలికింది. మాంసాహారానికి దూరంగా ఉండటంతో డిమాండ్ పడిపోయిందని, ఫలితంగా చికెన్‌ధరలు దిగొచ్చాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం కేజీ ధర రూ. 185 పలుకుతుంది. క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి వరకు చికెన్ ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

రూ. 7.5కు గుడ్డును అమ్ముతున్నారు

-చిరంజీవి, కనుకులగిద్దె



కోడిగుడ్డు రూ. 5 నుంచి ఏకంగా రూ. 7.5 వరకు ధర పెరిగింది. సామాన్యుడు కోడిగుడ్డు తినాలంటే భారమే. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని కోడిగుడ్డు తినిపిస్తున్నాం. ఇప్పుడు ధర పెరుగడంతో తినిపించలేకపోతున్నాం.

కోడెలు అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిపై చర్య తీసుకోవాలి

- వేములవాడ పట్టణ పోలీసులకు బీజేపీ నేతల ఫిర్యాదు


వేములవాడ పట్టణ ఎస్సై అంజయ్యకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం గోశాల నుండి కోడెలను తీసుకువెళ్లి గోవధశాలకు విక్రయిస్తున్న మాదాసు రాంబాబు అనే వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్షుడు, పురపాలక సంఘం 20వ వార్డు కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు పోలీసులను కోరారు. ఈ మేరకు స్థానిక బీజేపీ నేతలతో కలిసి సోమవారం వేములవాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మనుగొండ గ్రామానికి చెందిన మాదాసు రాంబాబు అనే వ్యక్తి ఓ సొసైటీ పేరుతో దాదాపుగా 60 కోడెలను వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయం గోశాల నుండి తీసుకెళ్లి అక్రమంగా గోవధ శాలలకు అమ్ముతున్నట్లు తేలిందని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి సమగ్రంగా విచారణ జరిపి సదరు వ్యక్తితో పాటు అతనికి సహకరించిన అందరిపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం గోశాలలో జరుగుతున్న అక్రమాలపై పోలీసు శాఖ పక్కాన విచారణ జరపాలని కోరినట్లు ఈ సందర్భంగా రేగుల సంతోష్ బాబు తెలిపారు. దేవాలయాల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నట్లు కోడెల వ్యవహారంతో స్పష్టంగా తెలిసిపోతున్నదని, రాజన్న కోడెలను అక్రమంగా దళారులకు దొంగ చాటుగా అందజేస్తున్నారని అన్నారు. రైతులకు కోడెల పంపిణీ పేరిట పెద్ద ఎత్తున హంగు ఆర్భాటాలతో కార్యక్రమం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కోడెల పంపిణీలో జరుగుతున్న అక్రమాలను పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నదని అన్నారు. మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం సైతం సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని, మరోసారి కోడెలు పక్కదారి పట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంతోష్ బాబు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పిస్నింటి హనుమాన్లు, అక్కపెల్లి వివేక్ రెడ్డి, గుడిసె మనోజ్, రేగుల రాజకుమార్, నామాల శేఖర్, బిల్ల కృష్ణ, మైలారం శ్రీనివాస్, జవ్వాజి రాజశేఖర్, రేగుల శ్రీకాంత్, మామిళ్ళ లక్ష్మీరాజం, నేరెళ్ల సాయి, సగ్గు రాహుల్, కోరెపు వెంకటేష్ పాల్గొన్నారు.

వేములవాడకు పోటెత్తిన భక్తజనం


భక్తులతో కోలాహలంగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాలను తరలివచ్చిన భక్తులు కోనేరులో పవిత్రస్నానాలు ఆచరించి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. తెల్లవారు జాము నుంచి కోడె మొక్కు క్యూలైన్‌లో బారులుదీరారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారు మూడు గంటలపాటు నిరీక్షిం చారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్ దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

సంక్షిప్త సమాచారం

పాలకుర్తి: ఏటూరునాగారం మండలం చెల్పాక సమీప అడవుల్లోని పోకలమ్మ వాగు దగ్గర జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసనగా సోమవారం మావోయిస్టు తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చింది. అక్కడ మృతి చెందిన తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు, కోటి (49)సొంత మండలమైన పాలకుర్తిలో బంధ్ పిలుపునకు స్పందన కరువైంది.

- పాలకుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం యాసంగి కూరగాయల సాగులో సూచనలపై హైదరాబాదు నుంచి శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తారని మండల వ్యవసాయశాఖ అధికారి బండి ప్రమోద్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

ముత్తారం: మండలంలోని ప్రజలు మానేరు నుంచి ఇసుక తీసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కాంగ్రెస్ మండల నాయకులు కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతి పత్రం సోమవారం అందజేశారు.

- ముత్తారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో జీవశాస్త్రంపై ప్రతిభ పోటీలను నిర్వహించగా మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలకు చెందిన విద్యార్థులు సహస్ర మొదటి, సాయికీర్తన ద్వితీయ స్థానం సాధించారు.

- ముత్తారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు జరుగుతాయని ఎంపీడీవో సురేష్ తెలిపారు.

జూలపల్లి: గత ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా మార్పు చేసిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు మండలకేంద్రంలో నిరసన వ్యక్తం చేసారు.

మంథని: స్థానిక జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ స్కూల్‌లో మంథని, ముత్తారం మండలాల్లోని ఉపాధ్యాయులకు సోమవారం డీఆర్పీలు శిక్షణ ఇచ్చారు.

నేటి నుంచి సమ్మె బాటలో సమగ్రశిక్ష ఉద్యోగులు

- ఉద్యోగ భద్రత, ఇతర సౌకర్యాలపై ఆందోళన
- జిల్లాలో 428 మంది ఉద్యోగులు

పెద్దపల్లి రూరల్/ధర్మారం డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యాశాఖకు చెందిన సమగ్ర శిక్ష సిబ్బంది మంగళవారం నుంచి సమ్మెబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెద్దపల్లి జిల్లాలో పనిచేస్తున్న సిబ్బంది విధులకు దూరం కానున్నారు.


పెద్దపల్లిలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

ఇప్పటికే జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. మంగళవారం నుండి విధులకు హజరుకామని తేల్చి చెప్పారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఉద్యోగులు సమ్మెబాట పట్టనున్నారు. సమ్మెలో చేపట్టాల్సిన కార్యాచరణ పూర్తి చేశారు. ఉద్యోగులు ఇచ్చిన నిర్ణీత గడువు తేదీ వరకు ప్రభుత్వం చర్యలకు ఆహ్వానించి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తే సమ్మె ఆలోచన విరమించుకుంటామని పేర్కొంటున్నారు.

● విద్యాశాఖలో పలు పేర్లతో..

విద్యాశాఖలో జిల్లా స్థాయిలో ఏపీవోలు, డీపీవోలు, సాంకేతిక నిపుణులు, సిస్టమ్ అనాలసిస్ సిబ్బంది పేర్లతో పనిచేస్తున్నారు. మండలస్థాయిలో కంప్యూటర్ సహాయకులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవలు అందించే భవిత కేంద్రాల్లో ఉపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్‌లు, పాఠశాల స్థాయిలో ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీలు, సహాయకులు, కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, ఏఎన్ఎంలు, పీఈటీలు, అకౌంటెంట్లు, కంప్యూటర్ సహాయకులు, వంట పనిచేసేవారు, వాచ్‌మెన్‌లు, స్వీపర్లు, స్కావెంజర్లు పనిచేస్తున్నారు. ఒక్కో సీఆర్పీ తమ పరిధిలోని పాఠశాలలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి అందిస్తూ డీఈవో, ఎంఈవోలకు మధ్య అనుసంధాన కర్తలుగా వ్యవహరిస్తున్నారు. బోధనేతర బిల్లు, భోజనబిల్లు తయారు చేయడం, వీరంత కూడా సమ్మెలో పాల్గొంటే విద్యాశాఖ ప్రగతిపై ప్రభావం పడనుంది.

● సమ్మె నోటీస్ అందజేత

కాల్వశ్రీరాంపూర్: మండలంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మహేష్‌కు మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో సమ్మె నోటీస్‌ను అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షఅభియాన్ ఉద్యోగులు కె స్వామి, దుర్గాప్రసాద్, దేవదాస్, రమేష్, సంధ్యారాణి, చందర్, చంద్రకళ, కుమారస్వామి ఉన్నారు.

ఉద్యోగుల డిమాండ్‌లు ఇవే..

- ఉద్యోగులందని రెగ్యూలైజ్ చేయాలి. అప్పటి వరకు పే స్కేల్ అమలు చేయాలి.
- ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా 20 లక్షలు, ఆరోగ్య బీమా 10 లక్షల సౌకర్యం కల్పించాలి.
- పదవీ విరమణ చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులకు బెనిఫిట్స్ కింద 25 లక్షలు ఇవ్వాలి.
- ప్రభుత్వ మరియు విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలి.
- పార్ట్ టై ఇన్స్‌ట్రక్టర్ల (పీటీఐ)లకు 12 నెలల వేతనం చెల్లించాలి.
- ఎస్ఎస్ఏ ఉద్యోగులందరికి రీ-ఎంగేజ్ విధానాన్ని తొలగించాలి.

● పరిష్కరించే వరకు పోరాటం ఆగదు

- తిప్పని తిరుపతి, సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా జేఏసీ అధ్యక్షుడు, పెద్దపల్లి



ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీతో సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నాం. లేనిపక్షం లో న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటాలు చేయడంతో పాటు సమ్మెను ఉధృతం చేస్తాం. ఈనెల 10 నుంచి ఉద్యోగులు కార్యాలయాలకు హాజరుకాకపోవ డంతో పాటు విధులకు హాజరుకారు.

మా బాధల్ని అర్థం చేసుకోవాలి

- నిమ్మ సునీత ఎంఐఎస్, ధర్మారం మండల మహిళా అధ్యక్షురాలు



నేను 12 సంవత్సరాలుగా ఎస్ఎస్ఏలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాను. 2023లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలిపినప్పుడు అప్పటి పీసీసీ అధ్యక్ష హోదాలో రేవంత్‌రెడ్డి మాకు మద్దతు తెలిపి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెల లోపు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సీఎం మాబాధలను అర్థం చేసుకొని న్యాయం చేయాలి.

ఇల్లు గడవడం కష్టంగా ఉంది.

- నేరెళ్ల రాజ్‌కుమార్, మెసేంజర్, సమగ్ర శిక్ష జేఏసీ నాయకుడు



నేను 2011 నుంచి సమగ్ర శిక్షలో మెసేంజర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. అప్పటి నుంచి చాలీచాలని జీతాలతో పని చేస్తున్నాము. ఇప్పుడు అధిక ధరలతో ఇల్లు గడవడమే కష్టంగా మారింది. దయచేసి మమ్మల్ని ప్రభుత్వం రెగ్యులర్ చేయాలి. లేదంటే సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి.

స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

కూడా ఓటర్ల జాబితాను గుర్తిస్తున్నారు. అలాగే పోలింగ్ స్టేషన్లో మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్లు తేల్చిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి నుంచే గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. కొందరు నాయకులు ప్రజలను ఆయా వర్గాల వారిని ప్రసన్నం చేసుకుంటూ వారి ఓట్లను ఇప్పటి నుంచి ఆశిస్తున్నారు. ఆయా సంఘాలు నిర్వహించే కార్యక్రమాలు, సామూహిక కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలంటూ కోరుతున్నారు. అయితే తమ సర్పంచ్ స్థానం ఏ సామాజిక వర్గానికి రిజర్వ్ అవుతుందోననే ఉత్కంఠ మాత్రం అన్ని పార్టీల నాయకుల్లో నెలకొన్నది. బీసీ నాయకులు తమ పంచాయతీ బీసీ జనరల్‌కు కేటాయించినా, ఓసీ జనరల్‌కు కేటాయించినా తామే పోటీ చేయాలని, బీసీ మహిళ, ఓసీ మహిళకు రిజర్వు చేస్తే మాత్రం తమ కుటుంబంలో ఉండే మహిళ సభ్యులను బరిలో నిలపాలని భావిస్తున్నారు. వచ్చే స్థానికసంస్థల ఎన్నికలు మాత్రం రసవత్తరంగా జరిగే అవకాశాలు ఉన్నాయి.

గోదావరిఖనిలో రోడ్ల విస్తరణకు శ్రీకారం


షాపుల ఎదుట గద్దెలను ఎక్స్‌కావేటర్‌తో తొలగిస్తున్న అధికారులు

కోల్‌సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్‌లో సోమవారం రోడ్ల విస్తరణ పనులు మొదలయ్యాయి. ఇప్పటికే రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్(ఆర్‌డీపీ) ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు మార్కింగ్ ఇచ్చారు. రీగల్ షూ మార్ట్ నుంచి బాలాజీ స్వీట్ హౌస్ వరకు 40అడుగులు, అజయ్ మెడికల్ స్టోర్ నుంచి పాపులర్ షూమార్ట్ వరకు 30అడుగులకు మార్కింగ్ ఇచ్చారు. ఇటీవల నోటీసులు కూడా ఇచ్చారు. సోమవారం విస్తరణకు శ్రీకారం చుట్టారు. రీగల్ షూమార్ట్ నుంచి లక్ష్మీనగర్ వరకు షాపుల ముందు ఉన్న గద్దెలను, రోడ్లపై వేసిన రేకులను, అదనపు కట్టడాలను ఎక్స్‌కావేటర్‌తో తొలగించారు. ఈ సందర్భంగా పలువురు రెండు మూడు రోజుల గడువు కోరారు. ఇప్పటి వరకు వ్యాపార వర్గాల్లో ఒకరు తొలగిస్తే మరొకరం తొలగిస్తామంటూ వేచి చూసే ధోరణి అవలంభించారు. సోమవారం టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు రంగంలోకి దిగడంతో ఎవరికి వారుగా తొలగింపులు చేపట్టారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

సుల్తానాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తాము ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సుల్తానాబాద్ ఎంపీడీవో దివ్యదర్శన్ రావును కలిసి తమ సమస్యలపై సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ ప్రత్యేక అధికారుల పాలనలో నిధుల సమస్యతో పాటు తీవ్రమైన పనిభారంతో తాము మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులను ఇందిరమ్మ ఇళ్ల సర్వే నుంచి మినహాయించాలని కోరారు. కార్యదర్శులు మంగారెడ్డి, రాధ, అనిత, మౌనిక, ఆసియా, హేమలత, రాజేశ్ కుమార్, రమేష్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్షతో తెలంగాణ ఏర్పాటు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ఆమరణ దీక్షతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సోమవారం పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో డిసెంబరు 9 అత్యంత ప్రాముఖ్యం కలిగిన రోజని ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేసీఆర్ దీక్షతో తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నామని డిసెంబరు 9న కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో తెలంగాణ ఏర్పాటు సుగమమైందన్నారు. కార్యక్రమంలో ఉప్పురాజ్ కుమార్, పూదరి చంద్రశేఖర్, నాంసాన సరేశ్ బాబు, రేవల్లి స్వామి, కనుకుర్తి కార్తీక్, రామగిరి చంద్రమౌళి, ఫహీమ్ సయ్యద్ మొబినొద్దీన్, పెంచాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

ఉద్యమకారులకు న్యాయం చేయాలి

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ రాష్ట్ర సాధనలో పోరాడిన ఉద్యమకారులకు న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్, జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. పెద్దపల్లి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద సోమవారం సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భరంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలని కోరారు. నూనె రాజేశం, బత్తుల శంకర్, డబ్బేట చంద్రకళ, తాడూరి శ్రీమాన్, కందుల సదాశివ్, బింగి రాజు, మంద భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు


కాల్వశ్రీరాంపూర్‌లో..


గోదావరిఖనిలో..


పెద్దపల్లిలో..

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్


గోదావరిఖనిలో లీగల్ సెల్ ఆధ్వర్యంలో..


ధర్మారంలో..


సుల్తానాబాద్‌లో..


ముత్తారంలో..


రామగిరిలో..

గురువుకు పూర్వ విద్యార్థుల భరోసా

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిన్న తనంలో విద్యాబుద్ధులు నేర్పిన గురువుకు శేషజీవితంలో పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న గురువు కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. కుటుంబ పోషణకు నెలవారీగా ఐదు వేల రూపాయల పెన్షన్‌ను సోమవారం అందించారు. గోదావరిఖనిలో ఒకటే సర్కార్ బడి ఉన్న పరిస్థితుల్లో విఠల్‌నగర్ గుడిసెల్లో బడిపెట్టి దళిత, బడుగువర్గాల పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించారు. వృద్ధాప్యంలో ఉన్న పాపయ్య కుటుంబాన్ని ఆదు కునేందుకు పూర్వ విద్యార్థులైన కార్పొరేటర్ పాముకుంట్ల భాస్కర్, సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు, టీబీజీకేఎస్ నాయకులు పర్లపల్లి రవి, కుక్కల రాజన్న, మాజీ కార్పొరేటర్ బొబ్బిలి సతీష్ తదితరులు ముందుకు వచ్చారు. నెలకు ఐదు వేల రూపాయల పెన్షన్ రూపంలో ఇచ్చారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

కమాన్‌పూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెలమ సామాజిక వర్గాన్ని కించపరుస్తూ మాట్లాడిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్యపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంథని డివిజన్ వెలమ సంఘం గౌరవ అధ్యక్షుడు ఇనగంటి మురళీ మనోహర్‌రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన సోమవారం మాట్లాడారు. వెలమ సామాజిక వర్గం ప్రజలకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

చెరువు నీటిని అడ్డుకోవడం సరికాదు

పాలకుర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి, పాలకుర్తి గ్రామాలకు కమ్మరిఖని వాగునుంచి వచ్చే నీటిని కేశోరాం సిమెంటు కంపెని అడ్డుకోవడం సరికాదని కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కౌశిక హరి అన్నారు. సోమవారం పాలకుర్తి గ్రామానికి చెందిన పెద్దపల్లి నాగరాజు, యూనియన్ ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్ తదితరులు కౌశిక హరికి సమస్యను వివరించారు. గుట్టల పైనుంచి వచ్చే నీటి కాలువను కంపెనీ పూడ్చి వేసిందని దీంతో పాలకుర్తి, ఈసాలతక్కళ్లపల్లి గ్రామాలకు రావాలసిన వర్షపు నీరు రాకపోవడంతో రెండు చెరువులు నిండడంలేదని తెలపడంతో కౌశిక హరి కాలువను పరిశీలించి కాలువకు మరమ్మతు చేయించి రెండు చెరువులు నిండేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంట్రాక్టు కార్మికులు, యువకులు ఉన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల సంబరాలు


ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

మార్కండేయకాలనీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులు సోమవారం గోదావరిఖనిలో సంబరాలు చేసుకున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 630 మంది లబ్ధిదారులకు ఎన్‌టీపీసీ జంగాలపల్లిలో రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో డ్రా పద్ధతిలో అలాట్‌మెంట్ ఇచ్చారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని లబ్ధిదారులు గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. అనంతరం రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, మంత్రి శ్రీధర్‌బాబు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీభిషేకం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇంటి కోసం ఎదురు చూస్తున్న తమకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారన్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దీటి బాలరాజు, గట్ల రమేష్, ముస్తాఫా, దూళికట్ట సతీష్, మొహిద్ సన్ని పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



ధర్మారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మాజీ సర్పంచ్‌లు

పెద్దపల్లి రూరల్/ఎలిగేడు/ధర్మారం/కాల్వశ్రీరాంపూర్/జూలపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వగా జిల్లా వ్యాప్తంగా వారిని పోలీసులు సోమవారం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పెద్దపల్లి మండలంలో అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచ్‌లు చీకటి స్వరూప-పోచాలు, చుంచు సదయ్య, రావిశెట్టి కిషన్, కన్నం జై, తీగల సదయ్య, ఎలిగేడు మండల మాజీ సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మాడ కొండాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆర్‌కె రాజా, తంగేళ్ల స్వప్నకుమార్, చిలుముల లక్ష్మణ్, ధర్మారం మండలంలో మాజీ సర్పంచ్‌లు పూస్కూరి జితేందర్‌రావు, జనగామ అంజయ్య, చెనెల్లి సాయికుమార్, కోమటిరెడ్డి లలిత బుచ్చిరెడ్డి, రెడపాక ప్రమీల-శ్రీనివాస్, సాగంటి తార-కొండయ్య, సామంతుల జానకీ శంకర్, గంధం వరలక్ష్మి నారాయణ అరెస్ట్ అయినవారిలో ఉన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలో మాజీ సర్పంచ్‌లు కాసర్ల తిరుపతిరెడ్డి, దొమ్మరి శ్రీనివాస్, మర్రి సంగీతమహేందర్ ఉన్నారు. జూలపల్లి మండలంలో అరెస్టు చేసిన వారిలో కుంటూరి రాజయ్య మల్లేశం, జ్యోతిబసు తదితరులు ఉన్నారు.



నేటి నుంచి మల్టీ డిపార్ట్‌మెంట్ బృందాల పర్యటన


మాట్లాడుతున్న జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలో మంగళవారం నుంచి 14 వ తేదీ వరకు మల్టీ డిపార్ట్‌మెంట్ బృందాల పర్యటన ఉండనున్నట్టు జీఎం వెంకటయ్య తెలిపారు. సోమవారం జీఎం ఆఫీస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో జీఎం మాట్లాడారు. ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్ల స్థితి గతులు, ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణ, బొగ్గు రవాణా నాణ్యతలపై మల్టీడిపార్ట్‌మెంట్ బృందాలు తనిఖీ చేయనున్నట్టు జీఎం తెలిపారు. ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరుకావాలని, పని వేళల్లో రక్షణ సూత్రాలు పాటించాలని సూచించారు. ఏరియాకు కేటాయించిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోనేలా ఉద్యోగులు కృషి చేయాలని, వినియోగదారులకు సరిపడా నాణ్యమైన బొగ్గు సకాలంలో అందేలా సమష్టి కృషి జరగాల్సిన అవసరం ఉన్నదని జీఎం పేర్కొన్నారు. సమావేశంలో ఎస్వోటూ జీఎం రాముడు, అధికారులు నరసింహారావు, మురళీకృష్ణ, అనిల్‌కుమార్, షరీఫ్ మహమ్మద్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేట్ జీఎం బత్తుల శ్రీనివాస్

గోదావరిఖని, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్మికులు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించి సంస్థ అభివృద్ధికి పాటు పడాలని కార్పొరేట్ జీఎం(ఐఅండ్‌పీ) ప్రోగ్రాం కన్వీనర్ బత్తుల శ్రీనివాస్, ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ సూచించారు. ఆర్జీ-1 జీడీకే 1,3 ఇంక్లైన్‌లో సోమవారం సింగరేణి స్థాయి 55వ రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. రక్షణ పక్షోత్సవాలకు ముఖ్య అతిథులుగా కార్పొరేట్ జీఎం (ఐఅండ్‌పీ) ప్రోగ్రాం కన్వీనర్ బత్తుల శ్రీనివాస్, ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ హాజరై రక్షణ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించి రక్షణ పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్షణలో ముందుకు సాగుతూ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తేనే సంస్థకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. చేసే పనిలో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీస్తుం దని, రక్షణపై అవగాహనతో పనులు చేసి సంస్థ అభివృద్ధికి పాటు పడాలని తెలిపారు. రక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు బహుమ తులు ప్రదానం చేశారు. సేఫ్టీ కమిటీ సభ్యులతో గనిలో రక్షణ మెరుగుప రడానికి తీసుకోవలసిన జాగ్రత్త చర్యల గురించి చర్చించారు. అనంతరం అండర్ గ్రౌండ్ 4వ సీమ్ 24/ఏ డీ పిల్లరింగ్ డిస్ట్రిక్ట్‌లో రక్షణ చర్యలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య కమిటీ సభ్యులు శ్రీనివాస్, బాలాజీరావు, జనార్దన్, జయంత్ కుమార్, పోషమల్లు, రామగుండం రీజియన్ సేఫ్టీ డీజీఎం సాయి ప్రసాద్, ఏజెంట్ రమేష్, కాలరీ మేనేజర్ రమేశ్, శ్రీనివాస్, సంక్షేమాధికారి ఇక్బాల్, రక్షణ కమిటీ మెంబర్స్(కార్పొరేట్) తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఓసీపీ-1 ప్రాజెక్టులో సోమవారం రక్షణ పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. సైటాఫీస్‌లో ప్రాజెక్టు అధికారి రాజశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై రక్షణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. సింగరేణిలో మొదటి ఓసీపీగా ప్రారంభమై అన్ని విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలుస్తు ఇతర ప్రాజెక్టులకు ఓసీపీ-1 ఆదర్శవంతంగా నిలుస్తుండడంతో ఉద్యోగుల కృషి ఉన్నదని పీవో అన్నారు. ప్రమాదాలు జరగకుండా అందరూ రక్షణ సూత్రాలను పాటిస్తూ ప్రమాదరహిత ప్రాజెక్టుగా నిలిపేలా కృషి చేయాలని అన్నారు. ఈనెల 12న భద్రతా తనిఖీ బృందం పర్యటిస్తుందని, గత ఏడాది మాదిరిగా ఈసంవత్సరం భద్రతలో, రక్షణ చర్యలు పాటించడంలో మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేయాలని కోరారు. మేనేజర్ ఉదయ్ హరిజన్, యాక్టింగ్ పీఈ నజీర్ అహ్మద్, సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాసరావు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు తిరుపతి, తిరుపతిరావు, వెంకటస్వామి పాల్గొన్నారు.

కోల్ ఇండియా స్థాయిలో ప్రతిభ కనపర్చాలి

ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే కోల్ ఇండియా స్థాయి కబడ్డీ పోటీల్లో సింగరేణి జట్టు క్రీడాకారులు ప్రతిభ కనపర్చి సంస్థ ఖ్యాతిని చాటాలని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ ఆకాంక్షించారు. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కంపెనీ స్థాయి కబడ్డీ-2024-25 వార్షిక క్రీడా పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ కార్యక్రమం సోమవారం సాయంత్రం స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రారంభించారు. ఈ సందర్భం గా జీఎం ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. సింగరేణి సంస్థ క్రీడాకారులకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంపెనీ స్థాయిలో కబడ్డీ పోటీల్లో ఎంపికైన ఆర్జీ-1 కబడ్డీ జట్టుకు హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక కోచ్ సరిరామ్‌చే శిక్షణ ఇస్తారన్నారు. క్రీడాకారులు మెళకువలు నేర్చుకొని రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘం ఆరెల్లి పోషం, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి బంగారు సారంగపాణి, వీరారెడ్డి, స్పోర్ట్స్ సూపర్‌వైజర్స్ రమేష్ పాల్గొన్నారు.

సింగరేణిలో మహిళా అండర్ మేనేజర్లు

గోదావరిఖని, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సింగరేణి గనుల్లో పని చేసేందుకు మహిళలు ముందుకు వస్తున్నారు. మైనింగ్‌లో డిప్లొమా, ఇంజనీరింగ్ చేసి ఇటీవల జరిగిన జేఎంఈటీ పరీక్షల్లో ఉద్యోగాలు సాధించారు. సింగరేణి వ్యాప్తంగా 136 మంది మైనింగ్ అండర్ మేనేజర్లు ఎంపికగా ఇందులో 36మంది మహిళలు ఉన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు తీసుకున్నారు. ఆర్జీ-1, 2, 3లలో పోస్టింగ్ ఇచ్చారు. సోమవారం 15 మంది అండర్ మేనేజర్లు ఆర్జీ-1లో రిపోర్టింగ్ చేశారు. ఇందులో ఐదుగురు మహిళలు ఉన్నారు. వీరికి జీడీకే 11ఇంక్లైన్, జీడీకే 1, 2, 2ఏల్లో పోస్టింగ్ ఇచ్చారు.